ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 | సంచిక : 70 | బుధవారం 12, నవంబర్ 2025 | పేజీలు: 06 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com

# అందెశ్రీకి కన్నీటి వీడ్కోలు

అధికారిక లాంఛనాల మధ్య అంత్యక్రియలు
అంతిమ యాత్రలో పాడె మోసిన సీఎం రేవంత్ రెడ్డి
హాజరైన మంత్రులు పొన్నం, సీతక్క, అడ్లూరి, పొంగులేటి
భారీగా తరలి వచ్చిన జనం, సాహితీ ప్రియులు

## దారి పొడుగునా అందెశ్రీ అమర్ రహే నినాదాలు



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

ప్రముఖ కవి, రచయిత అందె శ్రీ ప్రస్థానం ముగిసింది. ఘట్‌కేసర్‌లోని ఎన్ఎఫ్‌సీ నగర్‌లో ప్రభుత్వ అధికారిక లాంఛనాల నడుమ అందె శ్రీ అంత్యక్రియలు ముగిశాయి. సీఎం రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు అందె శ్రీ అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పించారు. సీఎం రేవంత్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్వయంగా అందె శ్రీ పాడె మోసి కన్నీలు వీడ్కోలు పలికారు. అందరూ మౌనం పాటించగా.. గౌరవ సూచికంగా పోలీసులు గాల్లోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. అనంతరం అందె శ్రీ పార్థివదేహాన్ని సమాధి చేశారు. అంతకుముందు.. లాలాపేట్ నుంచి తార్నాక, ఉప్పల్ మీదుగా ఘట్‌కేసర్‌లోని ఎన్ఎఫ్‌సీ నగర్ మిగతా 2లో



# ఎట్టి పరిస్థితిలోనూ వదిలిపెట్టం

**ఎర్రకోట వద్ద బాంబు దాడి ఘటనపై స్పందించిన ప్రధాని**

నిందితులను పట్టుకుంటామని వెల్లడి
బాధ్యులందరినీ చట్టం ముందు నిలబెడతాం
మృతుల కుటుంబాలకు సంతాపం
భూటాన్ లో ప్రధాన మంత్రి మోదీ

**న్యూఢిల్లీ, ప్రజాస్వరం :**

ఢిల్లీ పేలుడు ఘటనపై ప్రధాని మోడీ తీవ్రంగా స్పందించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం భూటాన్ వెళ్లిన మోడీ మంగళవారం (నవంబర్ 11) థింపూలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఢిల్లీ పేలుడు వెనుక ఉన్న కుట్రదారులను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. పేలుడుకు బాధ్యులైన అందరినీ చట్టం ముందు నిలబెడతామన్నారు. ఢిల్లీ పేలుడు ఒక భయంకరమైన ఘటన అని.. బాధిత కుటుంబాల దుఃఖాన్ని తాను అర్థం చేసుకోగలనని ఆవేదన వ్యక్తం చేశారు. దేశం మొత్తం బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తోందని ధైర్యం చెప్పారు. కుట్ర కోణంపై ఏజెన్సీలు ముమ్మురంగా దర్యాప్తు చేస్తున్నాయని.. ఈ కుట్రను ఏజెన్సీలు ఛేదిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. భారీ పేలుడుతో సోమవారం దేశరాజధాని ఢిల్లీ ఒక్కసారిగా ఉలిక్కిపడిన మిగతా 2లో



## నవీన్ యాదవ్‌కు భారీ మెజార్టీ ఖాయం

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలవబోతుందన్న టీపీసీసీ చీఫ్
ఎగ్జిట్ పోల్స్ ఇదే విషయం చెప్పాయన్న మహేశ్ కుమార్ గౌడ్
ప్రజలంతా నవీన్ వైపు నిలిచారని వ్యాఖ్య

02





## బీహార్‌లో ముగిసిన రెండోదశ పోలింగ్

అత్యధికంగా 67.14శాతం ఓటు హక్కు వినియోగం
ఓటేసిన దాదాపు 1.75 కోట్ల మంది మహిళలు
కృష్ణగంజ్‌లో అత్యధికంగా 76.2 శాతం పోలింగ్

02

# జూబ్లీహిల్స్‌లో ముగిసిన పోలింగ్

సాయంత్రం వరకు 47.16 శాతం పోలింగ్
క్యూ లైన్‌లో ఉన్న వారికి ఓటేసే అవకాశం
షేక్‌పేట డివిజన్‌లో పోలీసుల లాఠీఛార్జి
పలువురు ఎమ్మెల్యేల పై కేసు నమోదు

**హైదరాబాద్, ప్రజాస్వరం :**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. ఓటర్లు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో పోలింగ్ శాతం తక్కువగా నమోదయ్యింది. గత పక్షం రోజులుగా హోరాహోరీ ప్రచారం చేసి, ఓట్లను అర్థించిన ఓటర్లు పెద్దగా స్పందించ లేదు. ఉదయం నుంచి మందకొడిగా సాగిన పోలింగ్ పక్రియ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. పోలింగ్ సమయం ముగిసే నాటికి క్యూలైన్లలో నిల్చున్న వారందరికీ ఓటేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. యూసుఫ్‌గూడ మహబూబ్ ఫంక్షన్ హాల్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దొంగ ఓట్ల విషయంలో నిలదీసిన బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ నేతలు దాడులకు పాల్పడ్డారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి.. ఇరు పార్టీల నేతలకు సర్దిచెప్పారు. కాంగ్రెస్ పార్టీ దౌర్జన్యాల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయితే సాయంత్రం 5 గంటల సమయం వరకు 47.16 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తంగా పోలింగ్ దాదాపు 50 శాతం వరకు చేరుకునే అవకాశం ఉంది. ఈ నెల 14వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ మందకొడిగా సాగినప్పటికీ నియోజకవర్గంలోని కొన్ని డివిజన్లలో మాత్రం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా షేక్‌పేట డివిజన్‌లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఘర్షణ వాతావరణం నెలకొనడంతో, మిగతా 2లో

# తుపాన్ బాధితులకు రూ.12.99 కోట్లు



తక్షణ సాయం విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
16 జిల్లాల్లో దెబ్బ తిన్న 8,662 ఇండ్లు
రూ.15వేల చొప్పున నేరుగా బ్యాంకు అకౌంట్లలో జమ

# పేలుళ్లను మించిన కుట్ర.. రిసిన్ విష ప్రయోగం

విష ప్రయోగంతో వందల మందిని చంపాలని పన్నాగం
ఆముదం గింజల వ్యర్థాలతో రెసిన్ అనే విషాన్ని తయారు
టెర్రరిస్టు విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి
డాక్టర్ మొయినుద్దీన్‌ను అరెస్ట్ చేసిన గుజరాత్ ఏటీఎస్



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

రుచిలేని విషం రిసిన్... ఈ పేరు వింటేనే వెన్నులో వణుకు పుడుతుంది. ప్రపంచంలోనే అత్యంత ప్రాణాంతకమైన విషాలలో ఇదీ ఒకటి. దీని స్పెషాల్టీ ఏంటంటే రుచి ఉండదు, వాసన ఉండదు. గ్లాసు నీటిలో కలిపినా, కూడా అనుమానించలేరు. మృత్యువు ఆహారం రూపంలో మిగతా 2లో



## వాళ్లు డాక్టర్లు కాదు.. టెర్రరిస్టులు

ఢిల్లీ పేలుడు ఘటనపై స్పందించిన ఎమ్మెల్యే రాజా సింగ్
వారు 'జన్నత్ మిషన్' సిబ్బంది అంటూ సంచలన వ్యాఖ్యలు
ఎంత చదువుకున్నా వారి మనసుల్లో మత విషం నిండిపోయిందని విమర్శ

02

# కాంగ్రెస్ నేతల బెదిరింపులు

మహిళ అని కూడా చూడకుండా హేళన
ఓటమి భయంతోనే ఆగడాలకు దిగారు
బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత



**హైదరాబాద్, ప్రజాస్వరం :**

జూబ్లీహిల్స్‌లో ఓటర్లను కాంగ్రెస్ నేతలు బెదిరించారని బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ తెలిపారు. కాంగ్రెస్‌కు ఓటేయాలని బెదిరింపులకు దిగుతూ.. మాట వినకపోతే బూతులు మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళ అభ్యర్థి అని చూడకుండా బూతులు మాట్లాడతారా అని మండిపడ్డారు. జూబ్లీహిల్స్‌లో జరుగుతున్న రౌడీయిజం భరించలేక మాగంటి సునీత ఉద్వేగానికి గురయ్యారు. కాంగ్రెస్ గూండాల బెదిరింపులకు ఓటర్లు భయపడవద్దని సూచించారు. విజ్ఞతతో ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుందని మాగంటి సునీత అన్నారు. స్టేట్‌లో ఉన్న ఆకు రౌడీలంతా జూబ్లీహిల్స్‌లో తిరుగుతున్నారని తెలిపారు. సురేశ్ యాదవ్ అనే వ్యక్తి అడ్డగోలుగా మాట్లాడుతున్నాడని అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులకు జూబ్లీహిల్స్‌లో ఏం పని అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మిగతా 2లో



# బీహార్‌లో ముగిసిన రెండోదశ పోలింగ్

- అత్యధికంగా 67.14శాతం ఓటు హక్కు వినియోగం
- ఓటేసిన దాదాపు 1.75 కోట్ల మంది మహిళలు
- కృష్ణగంజ్‌లో అత్యధికంగా 76.2 శాతం పోలింగ్

హైదరాబాద్, ప్రజాస్వరం :

బిహార్ అసెంబ్లీ ఎన్నికల రెండో దశ పోలింగ్ ముగిసింది. చెదురుముదురు ఘటనలు మినహా ప్రశాంతంగా పోలింగ్ ముగిసిందని ప్రకటించారు. 20 జిల్లాల పరిధిలోని 122 సీట్లకు మంగళవారం పోలింగ్ జరిగింది. ఈ విడతలో 3.7కోట్ల మంది ఓటర్లకు గాను.. పోలింగ్ సమయం ముగిసే సమయానికి అత్యధికంగా 67.14శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. తొలి విడతలోనూ రికార్డు స్థాయిలో 65.9శాతం పోలింగ్ నమోదైన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల చరిత్రలోనే ఈసారి అత్యధిక పోలింగ్ నమోదైనట్లు తెలుస్తోంది. దాదాపు 1.75 కోట్ల మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల కమిషన్ తెలిపిన వివరాల ప్రకారం సాయంత్రం 5 గంటల వరకు 67.14 శాతం పోలింగ్ నమోదు అయింది. కృష్ణగంజ్‌లో అత్యధికంగా 76.2 శాతం పోలింగ్ నమోదు అయింది. కతిహార్‌లో 75.23 శాతం, పూర్ణిమలో 73.79 శాతం, సుపోల్‌లో 70.69 శాతం, పూర్వీ చంపారణ్‌లో 69.31 శాతం పోలింగ్ నమోదు అయింది. కొన్ని ప్రాంతాల్లో అత్యల్ప పోలింగ్ శాతం నమోదు అయింది. నవాడలో 57.11 శాతం, రోహ్తాస్‌లో 60.69 శాతం, మధుబణిలో 61.79 శాతం, అర్వాల్‌లో 63.06 శాతం పోలింగ్ నమోదు అయింది. ఇక, ఎన్నికలు జరిగిన 122 స్థానాల్లో వివిధ ప్రధాన పార్టీల నేతలతో సహా 1,302 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 2000లో బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 62.57శాతం నమోదు కాగా.. ఇప్పటివరకు ఇదే గరిష్ఠం. లోక్‌సభ ఎన్నికల విషయానికొస్తే.. 1998లో అత్యధికంగా 64.6శాతం పోలింగ్ నమోదైంది. మొత్తంగా రాష్ట్రంలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఈసారి రికార్డు స్థాయిలో పోలింగ్ జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

# వాళ్లు డాక్టర్లు కాదు.. టెర్రరిస్టులు

- ఢిల్లీ పేలుడు ఘటనపై స్పందించిన ఎమ్మెల్యే రాజా సింగ్
- వారు 'జన్నత్ మిషన్' సిబ్బంది అంటూ సంచలన వ్యాఖ్యలు
- ఎంత చదువుకున్నా వారి మనసుల్లో మత విషం నిండిపోయిందని విమర్శ

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటనపై గోషా మహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ తీవ్రంగా స్పందించారు. నిందితులుగా భావిస్తున్న కొందరి పేర్లను ప్రస్తావిస్తూ, వారు డాక్టర్లు కాదని, దేశంలో విధ్వంసం సృష్టించేందుకు సిద్ధమైన ఉగ్రవాదులని సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఆ వీడియోలో రాజా సింగ్ మాట్లాడుతూ.. "డాక్టర్ ముజమ్మిల్ షకీల్, డాక్టర్ ఆదిల్ అహ్మద్, డాక్టర్ షాహీన్, డాక్టర్ మొహియుద్దీన్ సయీద్, డాక్టర్ మొహమ్మద్ ఉమర్.. ఈ పేర్లు వింటే వీరంతా ఏదో వైద్య బృందం అని మీరు అనుకోవచ్చు. కానీ వీరు రోగుల ప్రాణాలను కాపాడే వైద్యులు కాదు. వీరంతా దురాశతో ఏర్పడిన, 72 మంది 'జన్నత్ మిషన్' సిబ్బంది. అంటే, వారందరూ ఉగ్రవాదులు" అని ఆరోపించారు. భారత్‌లో డిగ్రీలు సంపాదించి, లక్షల రూపాయలు ఖర్చు చేసి చదువుకున్నప్పటికీ, వారి మనసుల్లో మత విషం నిండిపోయిందని రాజా సింగ్ విమర్శించారు. "అంతిమంగా డాక్టర్ కాకుండా ఉగ్రవాదిగా మారడానికే అయితే, ఈ చదువుల నాటకం ఎందుకు? హిందువులను మోసం చేయడానికే ఇదంతా. ఈ దేశద్రోహులకు ఇళ్లు, రేషన్, ఆయుష్మాన్ కార్డులు వంటి లక్షల విలువైన సౌకర్యాలు కల్పించినా ప్రయోజనం లేదు" అని అన్నారు. చివరికి ఈ జిహాదీలు మదర్సాల్లో వారికి శిక్షణ ఇచ్చిన పనులనే చేస్తారని, వారి అసలు స్వరూపం అదేనని రాజా సింగ్ తన వీడియోలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు.




# కాంగ్రెస్ నేతల బెదిరింపులు

మొదటిపేజీ తరువాయి

తిరగాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఆర్ఎస్ ఏజెంట్లు కూర్చుంటే వాళ్లను కూర్చోనివ్వడం లేదని తెలిపారు.పోలింగ్ బూతుల్లోని టేబుళ్లను బయట పడేస్తున్నారని తెలిపారు. పోలీసులు వారి దగ్గరి టేబుల్స్, చైర్లు లాక్కొని దౌర్జన్యం చేస్తున్నారని మండిపడ్డారు. బిర్యానీల్లో డబ్బులు పెట్టి ఓటర్లకు ఇస్తున్నారని చెప్పారు. బిర్యానీ ప్యాకెట్లను చూసి కూడా పోలీసులు వదిలేస్తున్నారని తెలిపారు. కొన్ని బూత్‌ల్లో రిగ్గింగ్ చేస్తున్నారని ఆరోపించారు. వికలాంగులకు వీల్‌చైర్స్ కూడా సరిపడేంతగా పెట్టలేదని తెలిపారు. రజియా అనే అమ్మాయి ఇంటికి వెళ్లి దాడులకు దిగుతున్నారని అన్నారు. ఓటింగ్‌కు ఇంకా నాలుగు గంటల సమయం ఉండగా.. దయచేసి ప్రజలంతా బయటకొచ్చి ఓట్లు వేయాలని మాగంటి సునీత కోరారు. జూబ్లీహిల్స్ ఓటర్లు చైతన్యం ప్రదర్శించి ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని రౌడీరాజ్యంగా మార్చేశారని తెలిపారు. నవీన్ యాదవ్ మనుషులు వచ్చి రేపు నీ సంగతి చెప్తానని నన్నే బెదిరించారని పేర్కొన్నారు. ఇలాంటి రౌడీ రాజ్యాన్ని అడ్డుకోవాలంటే కేసీఆర్ పార్టీని గెలిపించాలని కోరారు. నా భర్త మాగంటి గోపీనాథ్ ఎన్నో ఎన్నికల్లో పోటీ చేశాడు.. కానీ ఇంత దౌర్జన్యం ఎప్పుడూ చూడలేదని సునీత అన్నారు. 13వ తేదీవరకు ఎన్ని కుట్రలు చేస్తారో చేయండి.. 14వ తేదీ తర్వాత నేను గెలిచాక అందరి సంగతి చెబుతానని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ప్రజలందరికీ బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు.

# అందెశ్రీకి కన్నీటి వీడ్కోలు

మొదటిపేజీ తరువాయి

వరకు జనసందోహం నడుమ అందె శ్రీ అంతిమయాత్ర కొనసాగింది. అందె శ్రీ అంతియ యాత్రలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, జూపల్లి కృష్ణారావు, అభిమానులు, సాహితీ ప్రియులు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. 500 మంది కళాకారులు యాత్ర సాగుతున్నంతసేపు ఆడిపాడారు. అమర్ రహే అందె శ్రీ అంటూ కడసారి కన్నీటి వీడ్కోలు పలికారు. అభిమానుల అశ్రునయనాల నడుమ అంత్యక్రియలు ముగిశాయి.



**అందెశ్రీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం: సీఎం రేవంత్**

అంత్యక్రియలు అనంతరం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. అందెశ్రీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామన్నారు. అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలని కేంద్రాన్ని కోరతామని.. కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహకరించాలని రేవంత్ కోరారు. ''తెలంగాణ ఉద్యమకారుడిగా రాష్ట్ర సాధనలో గొప్ప పాత్ర పోషించిన వ్యక్తి అందెశ్రీ. వారిని కోల్పోవడం తెలంగాణ సమాజంతో పాటు వ్యక్తిగతంగా నాకు తీరని లోటు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆయనను కలిసి తెలంగాణ ప్రజల సమస్యల పరిష్కారానికి మీ పాత్ర ఉండాలని కోరా. గద్దర్ అన్నతో పాటు అందెశ్రీ కూడా ప్రజల్లో స్ఫూర్తి నింపారు. ఆయన రాసిన ప్రతీ పాట తెలంగాణలో స్ఫూర్తిని నింపింది.. అందుకే ఆయన రాసిన "జయ జయహే తెలంగాణ" గీతాన్ని పాఠ్యాంశంగా చేర్చేందుకు మంత్రివర్గంలో నిర్ణయం తీసుకుంటాం. ఆయన పేరుతో ఒక స్మృతి వనాన్ని ఏర్పాటు చేస్తాం. వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ఆయన పాటల సంకలనం "నిప్పుల వాగు" ఒక భగవద్గీతగా, బైబిల్‌గా, ఖురాన్‌గా తెలంగాణ సమస్యలపై పోరాడేవారికి గైడ్‌గా ఉపయోగపడుతుంది. అందుకే 20 వేల పుస్తకాలను ముద్రించి తెలంగాణలోని ప్రతీ లైబ్రరీ లో ఆ పుస్తకాన్ని అందుబాటులో ఉంచుతాం'' అని సీఎం రేవంత్ తెలిపారు.

# జూబ్లీహిల్స్‌లో ముగిసిన పోలింగ్

మొదటిపేజీ తరువాయి



పోలీసులు రంగంలోకి దిగి లాఠీ ఛార్జ్ చేయాల్సి వచ్చింది. అక్కడ పోలింగ్ బూత్‌లు 4, 5, 6, 7, 8 వద్ద బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున గుమిగూడారు. వాళ్లు హడావిడి చేయడంతో పోలీసులు వెళ్ళిపోవాలని వార్నింగ్ ఇచ్చారు.. కానీ, గులాబీ కార్యకర్తలు వెనక్కి తగ్గకపోవడంతో పోలీసులు లాఠీలకు పని చెప్పారు. పలువురు కార్యకర్తలను బూత్ ఏరియాస్ నుంచి చెదరగొట్టడానికి లాఠీ ఛార్జ్ చేయాల్సి వచ్చింది. ఈ ఉద్రిక్తత వెనుక నాన్ లోకల్స్ ఇష్యూ ఉంది.. ఎన్నికల నిబంధనల ప్రకారం? నాన్ లోకల్స్ నియోజకవర్గంలో తిరగకూడదు. అయినప్పటికీ, బీఆర్ఎస్ మాజీ మంత్రులు, నాయకులు బూత్‌ల వద్దకు వచ్చి హడావిడి చేస్తూ? ఓటర్లను ఇన్‌ఫ్లూయెన్స్ చేసే ప్రయత్నం చేస్తున్నారు అని కాంగ్రెస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై ఇరు వర్గాల మధ్య పెద్ద గొడవ జరగడంతో పోలీసులు ఇరు వర్గాలను చెల్లాచెదురు చేయాల్సి వచ్చింది. ఒకవైపు ఓటింగ్ పర్సంటేజ్ మందకొడిగా సాగుతుంటే? మరోవైపు బస్తీలలో ఓటర్లను డబ్బులతో ఇన్‌ఫ్లూయెన్స్ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, డబ్బులు అందకపోవడం వల్ల కూడా ఓటర్లు ఓటింగ్‌కు రావట్లేదని ఓపెన్‌గా మాట్లాడుకున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి నేపథ్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో బీఆర్ఎస్ తరపున మాగంటి సునీత, కాంగ్రెస్ తరపున నవీన్ యాదవ్, బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి బరిలో ఉన్నారు. ఇదిలావుంటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియామవళిని ఉల్లంఘించిన పలువురిపై హైదరాబాద్ పోలీసులు 3 కేసులు నమోదు చేశారు. ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, రామచంద్రనాయక్, రాందాస్‌పై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, మెతుకు ఆనంద్‌పై బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదైనట్టు పోలీసులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠినంగా వ్యవహరిస్తున్నట్లు హైదరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విధానంలో ఎన్నికలు శాంతియుతంగా, పారదర్శకంగా జరగాలంటే ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియామవళిని గౌరవించాలని సూచించారు.

## నవీన్ యాదవ్‌కు భారీ మెజార్టీ ఖాయం

- ఎగ్జిట్ పోల్స్ ఇదే విషయం చెప్పాయన్న మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, ప్రజాస్వరం :

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల పోలింగ్, ఎగ్జిట్ పోల్ ఫలితాలపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధించబోతోందని ఆయన జోస్యం చెప్పారు. అన్ని ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని ఆయన అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలంతా నవీన్ యాదవ్ వైపు నిలిచారని ఆయన పేర్కొన్నారు. ఉప ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమను ముందుండి నడిపించారని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. నవీన్ యాదవ్ తప్పకుండా గెలుస్తారని, ఆయన విజయం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ టీపీసీసీ చీఫ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంలో తాము సఫలీకృతం చెందామని ఆయన అన్నారు.

# తుపాన్ బాధితులకు రూ.12.99 కోట్లు

- తక్షణ సాయం విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- 16 జిల్లాల్లో దెబ్బతిన్న 8,662 ఇండ్లు
- రూ.15వేల చొప్పున నేరుగా బ్యాంకు అకౌంట్లలో జమ



తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

మొంథా తుపాను కారణంగా రాష్ట్రంలోని 16 జిల్లాల్లో సంభవించిన భారీ వర్షాలు, వరదల్లో నష్టపోయిన కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం సహాయం ప్రకటించింది. ఈ మేరకు దెబ్బతిన్న ఇళ్లకు సహాయం అందించడానికి రూ. 12.99 కోట్లు విడుదల చేస్తూ రెవెన్యూ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ల నివేదికల ప్రకారం.. మొత్తం 8,662 ఇళ్లు దెబ్బతిన్నట్లు గుర్తించారు. దెబ్బతిన్న ప్రతి ఇంటికి రూ.15,000 చొప్పున సాయాన్ని నేరుగా బాధిత కుటుంబాల బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నారు. ఈ ఆర్థిక సహాయం వరద బాధితులకు కొంతమేర ఊరట కలిగించనుంది. మొంథా తుపాను కారణంగా ఇటీవల రాష్ట్రంలో సంభవించిన భారీ వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన వేలాది కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. వరద నష్టాన్ని అంచనా వేసిన వెంటనే.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, దెబ్బతిన్న ఇళ్లకు తక్షణ సహాయం కింద ప్రభుత్వం ఏకంగా రూ. 12.99 కోట్ల నిధులను విడుదల చేసింది. రెవెన్యూ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ ఈ మేరకు కీలక ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యంగా.. మొంథా తుపాను ప్రభావంతో ఇళ్లు పూర్తిగా లేదా పాక్షికంగా దెబ్బతిన్న ప్రతి కుటుంబానికి రూ.15,000 చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మొత్తాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా, నేరుగా బాధితుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. ఇది వరద బాధితులకు తాత్కాలికంగా ఉపశమనం కలిగించే గొప్ప ప్రయత్నంగా చెప్పుకోవచ్చు. గత అక్టోబర్ 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు వరుసగా నాలుగు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు రాష్ట్రంలోని పలు జిల్లాలు అతలాకుతలమయ్యాయి. వరంగల్, హన్మకొండ, వికారాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, యాదాద్రి భువనగిరి వంటి మొత్తం 16 జిల్లాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ జిల్లాల్లో పంట నష్టంతో పాటు, ముఖ్యంగా నివాస గృహాలు భారీగా ధ్వంసమయ్యాయి.

# పేలుళ్లను మించిన కుట్ర.. రిసిన్ విష ప్రయోగం

మొదటిపేజీ తరువాయి



శరీరంలోకి ప్రవేశిస్తుందని కూడా ఎవరూ గుర్తించలేరు. అటువంటి అత్యంత ప్రమాదకరమైన విషం రిసిన్. డాక్టర్ అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్... తన వైద్య పరిజ్ఞానాన్ని మనుషులను బతికించడానికి కాదు, వేల మందిని చంపడానికి ఉపయోగించాలని నిర్ణయించుకున్నాడు. ఇంతకీ ఈ రిసిన్ ని ఎలా తయారు చేస్తారంటే.. సులభంగా దొరికే ఆముదం గింజల నుండి రిసిన్ సేకరిస్తారు, తర్వాత దానిని శుద్ధి చేస్తారు. ఆపై దాన్నొక విషంగా తయారు చేస్తారు. ఈ చైనా డాక్టర్ ప్లాన్ ఎంత భయంకరమైందంటే... ఢిల్లీ, అహ్మదాబాద్, లక్నో వంటి మహా నగరాల్లో మంచినీరు, గుడి ప్రసాదాలలో ఈ విషాన్ని కలిపి, ప్రపంచంలోనే అతిపెద్ద సామూహిక విష ప్రయోగానికి పాల్పడాలని భావించాడు. ఒక్కసారి ఈ విషం జనం గొంతులోకి దిగితే..ఇక అంతే సంగతులు. ప్రపంచంలోనే అత్యంత భయంకరమైన సామూహిక విషప్రయోగంగా చరిత్రలో నిలిచిపోయేది. యాక్షన్ మొదలయ్యాక, వందలు, వేల మంది ఆస్పత్రుల పాలై, తమ మరణానికి కారణం ఏమిటన్నది తెలియకుండానే చనిపోయి ఉండేవారు. దీంతో దేశ వాసులు ఏ నీరు తాగాలన్నా హడలిపోయి.. దాహం బిగబట్టేవారు. అంతటి భయంకరమైన మాస్టర్ ప్లాన్ వేశాడీ విష ఉగ్రవాది.. మొహియుద్దీన్ సయ్యద్. డాక్టర్ సయ్యద్ ఒంటరివాడు కాదు. ఇతడి సహచరులు మొహమ్మద్ సుహేల్, ఆజాద్‌లతో పాటు భారీ ఇంటర్నేషనల్ సపోర్ట్ ఇతడి సొంతం. వీరు నిరంతరం టెలిగ్రామ్ ద్వారా ఐసిస్ ఉగ్రవాదులతో కోడ్ లాంగ్వేజీలో మాట్లాడేవారని తెలుస్తోంది. వీరికి పాక్ కి చెందిన ఉగ్ర మూకలు కొన్ని డ్రోన్ల సాయంతో ఆయుధాలు చేరవేసినట్టు గుర్తించారు. ఇది కేవలం విషం కాదు.. ఒక విష ఉగ్ర వ్యూహం. ఈ మొత్తం విష కుట్రను గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ బయటపెట్టింది. నిఘా వర్గాల నుంచి అందిన చిన్న సమాచారంతో రంగంలోకి దిగిన గుజరాత్ ఏటీఎస్. వీరి అనుమానాస్పద సంభాషణలు, టెలిగ్రాం కోడింగ్ మెసేజీలను డీ కోడ్ చేశారు. అలా ఈ ముగ్గురు దుండగులను సరైన సమయానికే పట్టుకున్నారు. వీరి డెన్ లో ఒక రిసిన్ తయారీ సెటప్ ని చూసి షాకై పోయారు ఏటీఎస్ అధికారులు.



# ఎట్టి పరిస్థితిలోనూ వదిలిపెట్టం

మొదటిపేజీ తరువాయి

విషయం తెలిసిందే. రెడ్ ఫోర్ట్ మెట్రో స్టేషన్ సమీపంలోని ట్రాఫిక్ సిగ్నల్ వద్ద జరిగిన బ్లాస్ట్‌లో ఇప్పటి వరకు 12 మంది చనిపోయారు. పేలుడు ధాటికి మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఘటనా స్థలాన్ని మొత్తం నల్లటి పొగ కమ్మేసింది. అరుపులు.. ఏడుపులతో ఆ ప్రాంతమంతా భయానకంగా మారింది. ఓ వ్యక్తి డెడ్‌బాడీ కారు సైడ్ మిర్రర్ పై వేలాడుతూ కనిపించింది. ఆటో రిక్షాపై ఓ వ్యక్తి చేయి తెగిపడింది. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సోమవారం (నవంబర్ 11) సాయంత్రం 6.52 గంటలకు హ్యుందాయ్ ఐ20 కారులో పేలుడు సంభవించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. బ్లాస్ట్ సమయంలో కారులో ప్రయాణికులు ఉన్నారని, వెహికల్ స్లోగా మూవ్ అవుతున్నదని చెప్తున్నారు. పేలుడు ధాటికి 22 కార్లు, 2 ఈ రిక్షాలు, ఒక ఆటో రిక్షా మంటల్లో కాలి బూడిదయ్యాయి. కొన్ని మీటర్ల దూరం వరకు పార్క్ చేసిన వాహనాల అద్దాలూ ధ్వంసం అయ్యాయి. ఇండ్లు, దుకాణాల తలుపులు, కిటికీ అద్దాలు పగిలిపోయాయి. ప్రమాదం అనంతరం 20 ఫైరింజన్లు ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేశాయి. పేలుడు ఘటనలో 24 మందిగాయపడ్డారు. వీరిలో 10 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. గాయపడిన వారిని దగ్గర్లోని ఎల్‌ఎన్‌జేపీ హాస్పిటల్‌కు తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు సంస్థలు కేసు నమోదు చేసి విచారణ మొదలుపెట్టాయి. అనుమానితులను అదుపులోకి తీసుకుని ఇంటరాగేట్ చేస్తున్నాయి ఏజెన్సీలు.



# ఉప ఎన్నికల్లో 30 వేల మెజార్టీ ఖాయం : కాంగ్రెస్

**మనోహరబాద్ (ప్రజాస్వరం ) :**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో 30 వేల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు ఖాయమని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి రాష్ట్ర ఫుడ్స్ చైర్మెన్ ఎలక్షన్ రెడ్డి, మనోహరబాద్ వైస్ ఎంపీపీ విట్టల్ రెడ్డిలు ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిపి లక్ష్యంగా ఉన్నారని అన్నారు. ప్రత్యర్థి పార్టీలు అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని తెలిపారు. ఎంతో నూతన ఉత్సాహం నింపిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదలకు, మధ్య తరగతి వర్గాల వారికి వరంగా మారాయని అన్నారు. శ్రీశైలం యాదవ్ నవీన్ యాదవులు ప్రతిరోజు ప్రజల మధ్యలో ఉంటూ వాళ్లకు సేవలు అందిస్తూ దశాబ్దాల కాలం పాటు ప్రజల మనిషిగా ప్రజల మనసు చూదు ఉన్నారని అన్నారు.

# అందె శ్రీ మరణం సాహితీ లోకాని తీరని లోటు

- **కవి రచయిత దేవులపల్లి రమేశ్**

**సిద్దిపేట, నవంబర్ 11, ప్రజా స్వరం**

తెలంగాణ సాహిత్య శిఖరం, తెలంగాణ ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ మరణం సాహితీ లోకానికే కాకుండా తెలంగాణ ఉద్యమ చరిత్రకు తీరని లోటు అని నంగునూర్ మండల కేంద్రానికి చెందిన కవి, రచయిత దేవులపల్లి రమేశ్, అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమంలో అందెశ్రీ రాసిన గేయాలు తన అక్షరాన్ని ఇంందనంగా మార్చి ప్రజల్లో నిత్య చైతన్యాన్ని జ్వలింప చేసిన చేసిన గొప్ప సాహిత్య యోధుడు అందె శ్రీ. నిత్యం పేదల పక్షాన గొంతుకగా వినిపించిన మట్టి మనిషి, అందెశ్రీ భౌతికంగా మన మధ్య లేక పోయినా, తెలంగాణ రాష్ట్ర అధికార గీతమైన "జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం " గేయంగా నిత్యం ప్రజల గుండెల్లో నిలిచి ఉంటారని, అందెశ్రీ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకులు సంజయ్ గౌడ్, తెలుగు రాజశేఖర్,కవి, రచయిత గడ్డం లింగ స్వామి, తెలుగు రాజశేఖర్, కవులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



# ఓటర్ జాబితా సిద్ధం చేసుకోవాలి

- **తహశీల్దార్ రజనీకుమారి**

**రామాయపేట. 11 ( ప్రజా సర్వం )**

మెదక్ జిల్లా రామాయపేట మండలంలో బూత్ లెవెల్ అధికారులు క్షేత్రస్థాయిలో ఓటర్ జాబితా సిద్ధం చేసుకోవాలని రామాయంపేట తహశీల్దార్ రజనీకుమారి సూచించారు. రైతు వేదిక ఆవరణలో మంగళవారం బీఎల్ సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని బీఎల్వోలు ఈ సమావేశానికి హాజరయ్యారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని, ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపు కార్యక్రమాలను త్వరగా చేపట్టాలని సూచించారు.



# విక్రయించిన ధాన్యానికి డబ్బులు రాక ఇబ్బంది పడుతున్న రైతన్నలు

- **కాంగ్రెస్ ప్రజా పాలనలో రైతుల కష్టాలు... మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి**

**నంగునూరు నవంబర్ 11 (ప్రజా స్వరం) :**

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటి నుండి ఇప్పటివరకు రైతులు అమ్మిన ధాన్యానికి రైతుల అకౌంట్లోకి డబ్బులు పడకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యం అని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య మండిపడ్డారు నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ..ఆరుగాలం కష్టపడి పండించిన పంట అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు నంగునూరు మండలం వ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించిన ధాన్యానికి రైతులకు డబ్బులు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు సకాలంలో ఎరువుల అందించి సమయానికి రైతులకు పెట్టుబడి అందించి ఆదుకున్నారని అదేవిధంగా పండించిన పంటకు గిట్టుబాటు ధరతో పాటు ధాన్యం విక్రయించిన వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేసేవారని టీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతుల పాలిట శాపంగా మారారని పెట్టుబడి సాయం అందించడంలో ఆలస్యం నకిలీ విత్తనాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని దానికి తోడు అకాల వర్షాలతో పంట నష్టపోయిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోకుండా జూబ్లీహిల్స్ ఉపయోగకపై పెట్టిన శ్రద్ధ రైతులపై పెట్టడం లేదని మండిపడ్డారు రైతుల కష్టాలు పట్టని కాంగ్రెస్ ప్రభుత్వానికి జూబ్లీహిల్స్ ఓట్లు కావాలి రైతులు పండించిన పంట ధాన్యం విక్రయించిన ఇప్పటికీ డబ్బులు అందకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను సంక్షేమ పథకాలు అందించడంలో విఫలమైందని కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలు గడిచిన 6 గ్యారంటీలు అమలు చేయడంలో విఫలమైందని అన్నారు ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వేణు చక్రవర్తి రంగు రాజు గౌడ్ చలికాని మల్లేశం కొల వీరయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు



# డంపింగ్ యార్డ్ చెత్త లారీ ఢీకొని వ్యక్తి మృతి





**జవహర్ నగర్, నవంబర్ 11, ప్రజాస్వరం:**

డంపింగ్ యార్డ్ చెత్త లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కారంలో లడ్డు తయారీ వ్యాపారం నిర్వహించే ఫల్గొని యాదవ్ (38) సోమవారం అర్ధరాత్రి బాలాజీ నగర్ నుండి మల్కారం వెళుతుండగా డంపింగ్ యార్డ్ వద్ద రోడ్డు పక్కన నిర్లక్ష్యంగా పార్క్ చేసిన జిహెచ్ఎంసి డంపింగ్ యార్డ్ చెత్త లారీని ఢీకొన్నాడు తలకు తీవ్ర గాయాలైన అతన్ని స్థానికులు గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

# విద్యుత్ షాక్ తో దాబా హోటల్ యజమాని మృతి

**రామాయంపేట. 11 ( ప్రజా సర్వం )**



విద్యుత్ షాక్ తో దాబా హోటల్ యజమాని మృతి చెందిన ఘటన రామాయంపేటలో చోటుచేసుకుంది. నిజాంపేట మండలం నస్కల్ గ్రామము చెందిన లాలా గౌడ్ అనే వ్యక్తి గత కొన్ని సంవత్సరాలుగా రామాయంపేటలో నివాసం ఉంటున్నారు. ఇటీవలే ఒక దాబా హోటలను ప్రారంభించారు. మంగళవారం ఉదయం దాబా హోటల్ వద్ద వస్తువులు సరి చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగిలి ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. లాలా గౌడ్ ను స్థానిక ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. లాల గౌడ్ మృతి తో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. లాలా గౌడ్ తన స్వగ్రామం నస్కల్ లో అంత్యక్రియలు పూర్తి చేశారు.

# టీవీ చోరీ నిందితుడి అరెస్టు..... రిమాండ్ తరలింపు...

**దుబ్బాక , నవంబర్ 11 (ప్రజాస్వరం) :**

ఇంట్లో ఉన్న ఎల్ఈడి టీవీ ని దొంగలించిన నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించిన ఘటన దుబ్బాక పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్సై కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన గాజుల భాస్కర్ అనే వ్యక్తి ఇంట్లోకి ఈనెల 7వ తేదీన ఒక దొంగ ప్రవేశించి, హాలులో ఉన్న 48 ఇంచుల ఎం ఐ ఎల్ ఈ డి టీవీని ఎత్తుకెళ్లాడు. దీనితో బాధితుడు ఈ నెల 8వ తేదీన దుబ్బాక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి, విచారణ చేపట్టిన పోలీసులు టీవీని దొంగలించిన వ్యక్తి పట్టణంలోని రెండు పడక గదుల గృహ సముదాయంలో నివాసం ఉండే మనోజ్ గా గుర్తించారు. మంగళవారం నిందితుడు మనోజ్ ను అదుపులోకి తీసుకొని విచారించగా, తానే టీవీ దొంగలించినట్టు అంగీకరించాడు. నిందితుడి వద్ద నుంచి ఎల్ఈడి టీవీని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దుబ్బాక కోర్టులో నిందితుడిని హాజరు పరచగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించాడు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల పోలింగ్ పరిశీలించిన విజయ్ కుమార్

**గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి, (ప్రజా స్వరం) :**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల పోలింగ్ సారలిని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కొమ్ము విజయ్ కుమార్ పరిశీలించాం అన్నారు. పోలింగ్ పర్సన్టేజ్ పెరిగితే నవీన్ యాదవ్ కు మెజారిటీ ఇంకా ఎక్కువ వచ్చే అవకాశం ఉంది అని అన్నారు. బిఆర్ఎస్, బిజెపి పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ పైన ఎన్ని అసత్య ఆరోపణలు చేసినాకూడా జూబ్లీహిల్స్ ఒరేటర్లు మాత్రం అవేమి పట్టించుకోకుండా నవీన్ యాదవ్ కే మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో యూత్ కాంగ్రెస్ గజ్వేల్ నియోజకవర్గం ఉపాధ్యక్షులు సమీర్, ఎన్ ఎస్ యు ఐ జిల్లా కార్యదర్శి భాను చందు, నాయకులు చింటు తదితరులు పాల్గొన్నారు.



# ఘోర రోడ్డు ప్రమాదం తల్లి మృతి, కొడుకు పరిస్థితి విషమం..

**నార్సింగి నవంబరు 11 (ప్రజా స్వరం)**



ద్విచక్ర వాహనంపై రామాయంపేట ఆసుపత్రికి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ అక్కడికక్కడే మృతి చెందాగా మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన నార్సింగ్ మండలం 44వ జాతీయ రహదారి వల్లభాపూర్ వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చేగుంట మండలం వల్లభాపూర్ గ్రామానికి చెందిన తల్లి కొడుకులు ధర్మారం బాలమని, (58) ధర్మారం రాములు ద్విచక్ర వాహనంపై రామాయంపేట ఆసుపత్రికి వెళ్తుండగా వల్లభాపూర్ శివారులోని 44వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తల్లి ధర్మారం బాలమని అక్కడికక్కడే మృతి చెందగా మృతదేహం నుజ్జునుజ్జయింది. కొడుకు రాములు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్ లో రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నార్సింగ్ ఎస్ఐ సృజన కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.





# భూకబ్జా దారుడు

- ఆదివాసీ ఎస్సీ మరియు ఎస్టీ భూములు అతని టార్గెట్
- ఆదివాసీల దగ్గర భూములు కొనడం డబ్బులు అడుగగా రౌడీలను పెట్టి దుర్జన్యం చేయడం అతని నైజం
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు, పోలీసులు, మాకు న్యాయం ఎవరు చేస్తారు అని వా పోతున్న ఆదివాసులు
- ప్రభుత్వ భూమి కబ్జా చేసిన కానీ చోద్యం చూస్తున్న

**భద్రాద్రి కొత్తగూడెం నవంబర్ 11(ప్రజాస్వరం):**

కొత్తగూడెం నియోజకవర్గం మున్సిపాలిటీ పరిధిలో గల కలెక్టరేట్ కి కుసవేటు దూరంలో గల పాలకోయతండలో ఆదివాసీల దగ్గర తక్కువ రేటు కి కొనుక్కొని వారికి డబ్బులు ఇవ్వకుండా మరల ఆ భూములను ఎస్సీ ఎస్టీ ఆదివాసీలకు అమ్ముకుంటూ భూ మాఫియా లాగా శ్రీ రామినేని హనుమంతరావు తయారు అయ్యాడు పాలకోయతండ లో గల 409 సర్వే నంబర్ లో భూమిలో నాలుగు ఎకరాల తొమ్మిది కుంటలు అతనికి లేఅవుట్ వచ్చింది, దానిలో ఇరవైనాలుగు ప్లాట్స్ చేసి వాటిని ఎస్సీ ఎస్టీ ఆదివాసీలలు విక్రయించి వారి ప్లాట్ లోకి వారు వెళితే రానివ్వకుండా గుండాలతో రౌడీలతో వారిపై విచక్షణ రహితంగా దాడి చేపించడం అదే భూమిని అనుకొని పడమర నా సర్వేనం 444 ఉన్న ప్రభుత్వ భూమి అర ఎకరము, దక్షిణం నా ఒక ఎకరం భూమి, ఉత్తరం నా ప్రవేట్ భూమి సుమారు ముప్పై కుంటలు కబ్జా చేశారు అటు చూస్తే ఇరువై నాలుగు ప్లాట్స్ సెటిల్ చేయకపోగా ప్రవేట్ భూమిలో గోడ మరియు ఇల్లు నిర్మించి ఇంటి చుట్టు గోడ చుట్టు రౌడీలను ఏర్పాట్ చేసి నిర్మించించిన ఇంటిలో మరక ద్రవ్యాలు మందు, గంజాయి, సేవిస్తూ రౌడీలకు ఒక అడ్డగా మార్చుకున్నారు ఇంత జరుగుతున్న కానీ రెవిన్యూ అధికారులకు ఎస్టీ ఆదివాసీలలు ఎన్ని సార్లు పిర్యాదు చేసిన కానీ పట్టించుకొని అధికారులు పోనీ పోలీసు వారికి ఫిర్యాద్ చేసిన కానీ ఉపయోగం లేని పరిస్థితి ఇదే చనువుగా చేసుకొని రౌడీలను గుండాలను భూమికి కపాల పెట్టుకొని ఎవరైనా వచ్చి అడుగుతే వారి మీదికి దౌర్జన్యం చేపించి తీవ్రంగా గాయపరిచే విధంగా చేస్తున్నాడు, భూ కబ్జా దారుడు హనుమంతరావు పై చర్యలు తీసుకొని మా భూములు మాకు ఇప్పించాలని బాధితులు వేడుకుంటున్నారు రెవెన్యూ అధికారులు ఇప్పటికీ కూడా స్పందించకపోతే మా భూములు పోతే పోనీ అతని ప్రభుత్వ భూమిని కూడా కబ్జా చేసి విక్రయిస్తున్న విషయం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేస్తామని తెలుపుతున్నారు అధికారులు స్పందిస్తారా లేదా వేచి చూడాలి.



## చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి





- పల్లెపాటి మాధవి మాదిగ.
- తూప్రాన్ ఐబీ గెస్ట్ హౌస్ లో సమావేశం

**మెదక్ జిల్లా, నవంబర్ 11(ప్రజాస్వరం):**

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుల పద్మశ్రీ మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు మెదక్ జిల్లా తూప్రాన్ డివిజన్ కేంద్రం ఐబీ గెస్ట్ హౌస్ లో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గావాయ్ పై జరిగిన పాశవిక దాడిని ఖండిస్తూ ఈ నెల 17 తారీకున దళితుల ఆత్మగౌరవ మహాప్రదర్శన ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని " హలో దలితా చలో ఢిల్లీ " కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మెదక్ జిల్లా ఎమ్మార్పీఎస్ కార్యదర్శి మాధవి పల్లెపటి మాధవి జిల్లా వ్యాప్తంగా పిలుపునిచ్చారు. జాతీయ కార్యదర్శి మెదక్ జిల్లా ఇంఛార్జి బొజ్జ సైదులు మాదిగ అధ్యర్యంలో జరిగిన ముఖ్య జిల్లా నాయకుల సమావేశంలో భాగంగా ఛలో డిల్లీ కార్యక్రమానికి నిర్ణయించిన సమయం తక్కువగా ఉన్నప్పటికీ అధిక సంఖ్యలో జనాన్ని సమీకరిస్తూ నూతన నాయకత్వనికి అవకాశం ప్రోత్సహం ఇస్తూనే విద్యార్థి విభాగాన్ని భాగస్వామ్యం చేయాలని సూచించారు. విద్యార్థి దశలో క్షేత్ర స్థాయిలో ఉద్యమం విజయవంతం అవుతుందనీ గుర్తుచేశారు. అలాగే ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తల తోపాటు తప్పనిసరిగా హాజరువ్వాల్సిన అవసరం ఎంతగానో ఉందని తెలియజేశారు. భవిష్యత్తు తరాలలో జస్టిస్ గవాయి కి జరిగిన సంఘటన మరెవరికీ రాకుండా ఉండాలంటే ఈ నెల 17న జరిగే దళితుల ఆత్మ గౌరవ ప్రదర్శన ర్యాలీతో ప్రపంచానికి చాటే విధంగా మరో యుద్ధానికి సిద్ధం కావలసిన అవసరం అవశ్యకత ప్రధాన్యత ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాములు, యదగిరి తదిరులు

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆర్.డి.ఓ జయ చంద్రా రెడ్డి

**తూప్రాన్ నవంబర్ 11(ప్రజాస్వరం):**


మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ కేంద్రంలో రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ జయ చంద్రా రెడ్డి తూప్రాన్ పీఏసీఎస్,(ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ సెంటర్) పీపీసీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా పంట కొనుగోలు కార్యకలాపాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. రైతులకు సమయానుకూలంగా చెల్లింపులు చేయాలని అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.




## ఆగిన జనన మరణాల సర్వర్

- జిల్లా వ్యాప్తంగా 4 రోజులుగా స్తంభించిన సేవలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

**తూప్రాన్ నవంబర్ 11(ప్రజాస్వరం):**




జననమరణాల ధృవీకరణ పత్రాల జారీ విషయంలో నాలుగు రోజుల నుంచి మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో ప్రతిష్టంభన ఏర్పడింది. మున్సిపల్ సిబ్బంది సర్వర్ డౌన్ ఉందనే కారణాలు చెబుతుండటంతో అత్యవసరంగా ధృవీకరణ పత్రాలు అవసరమున్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగురోజుల నుంచి సర్వర్ డౌన్ సమస్య తీరక అవస్థలు ఏర్పడుతున్నాయి. మెదక్ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో బర్త్ సర్టిఫికెట్ల జారీకి సర్వర్ డౌన్ సమస్యలతో ఆగిపోయిందని సమాచారం. అసలు నిరంతరం పనిచేయాల్సిన జనన మరణాల సర్వర్ ఆగిపోకూడదు. అన్ని శాఖల వెబ్ సైట్ల సర్వర్ లు పనిచేస్తుండగా ఒక జనన, మరణాల సర్వర్ మాత్రమే ఆగిపోవడం గమనార్హం. గత నాలుగు రోజులుగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా జిల్లా యంత్రాంగం పట్టించుకోకపోవడంతో జనాలు ఇబ్బందులు పడుతు న్నారు. సర్వర్ డౌన్ సమస్యలు తీరడానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం ఆదర్శనీయం

- అదనపు కలెక్టర్ నగేష్

**మెదక్ జిల్లా నవంబర్ 11(ప్రజాస్వరం):**

మెదక్ జిల్లా కలెక్టరేట్ లో అబుల్ కలాం 137వ ఆజాద్ జయంతి సందర్భంగా మంగళవారం మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంబంధిత అధికారులు సిబ్బందితో అదనపు కలెక్టర్ నగేష్ అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆజాద్ జయంతి రోజును జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహిస్తారని తెలిపారు. దేశంలోని విద్యాభివృద్ధికి బాటలు వేసిన మొదటి దేశ విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని కొనియాడారు. జర్నలిజంలో అపార అనుభవంతో ఉర్దూ పత్రికను నెలకొల్పి సమాజంలో నెలకొన్న రుగ్మతలను రూపుమాపేందుకు కృషి చేశారని చెప్పారు. కేంద్ర విద్యాశాఖా మంత్రిగా పని చేసి విద్యావ్యవస్థలో గణనీయమైన మార్పులు తీసుకవచ్చారని వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ భుజంగరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఇన్చార్జి మైనారిటీ సంక్షేమ అధికారి విజయలక్ష్మి, కలెక్టరేట్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుక

- నివాళి అర్పించిన నగర పోలీసు కమీషనర్ డా. శంఖబ్రత బాగ్చి, ఐపిఎస్..

**విశాఖపట్నం, నవంబర్ 11(ప్రజాస్వరం):**

సీపీ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారత స్వాతంత్ర్యం పోరాట చరిత్రలో విశిష్ట స్థానం సంపాదించిన మహనీయ నాయకుడని పేర్కొన్నారు. ఆయన గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల వంటి స్వాతంత్ర్య సంగ్రామాల్లో కీలక పాత్ర పోషించారని తెలిపారు. దాదాపు 10 సంవత్సరాల పాటు జైలు శిక్ష అనుభవిస్తూ దేశ స్వాతంత్ర్యనికి తన జీవితాన్ని అంకితం చేశారని చెప్పారు. మౌలానా ఆజాద్ 1888 నవంబరు 11న మక్కాలో జన్మించారని తెలిపారు. స్వాతంత్ర్యం తరువాత దేశ తొలి విద్యాశాఖా మంత్రిగా బాధ్యతలు స్వీకరించి భారత విద్యా వ్యవస్థకు బలమైన పునాది వేశారన్నారు. వయోజన అక్షరాస్యత, సార్వత్రిక ప్రాథమిక విద్య, బాలికా విద్యా ప్రోత్సాహం మరియు వృత్తి విద్యా అభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా 1992లో భారత ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రదానం చేసిందని, ప్రతి సంవత్సరం నవంబర్ 11న ఆయన జయంతిని "జాతీయ విద్యా దినోత్సవం"గా దేశవ్యాప్తంగా జరుపుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీ తో పాటుగా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పుష్పాలు సమర్పించి నివాళులు



## లయోలా వృద్ధాశ్రమానికి సహాయం అందజేసిన గాజువాక రాజీవ్ నగర్ వాస్తవ్యులు

**విశాఖపట్నం, నవంబర్ 11(ప్రజాస్వరం):**

పిల్లా కొత్త రాజు కుటుంబం మరియు గాజువాక సమతా నగర్ వాస్తవ్యులు బొర్రా రాజేశ్వరరావు వారి కుటుంబ సమేతంగా పెందుర్తి లోని లయోలా వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మరియు మిత్రుల సహకారంతో ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు అనాధలకు మతిస్థిమితం లేని వ్యక్తులకు వారి యొక్క పోషణార్థం కొరకు 500 కేజీల బియ్యం, 15 కేజీల కందిపప్పు 5 కేజీల పంచదార నూనె డబ్బా మరియు 50 కేజీలు ఉల్లిపాయలు 50 కేజీలు బంగాళదుంపలు వారికి విరాళంగా అందజేసి వారి యొక్క మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ యజమాని ప్రకాశరావు వారి యొక్క సాధక బాధకులను వారికి వివరించారు. గత 20 సంవత్సరాలుగా ఈ ఆశ్రమాన్ని ముందుకు నడిపిస్తున్న వారికి ప్రభుత్వం నుంచి ఏ విధమైనటువంటి గుర్తింపు లభించలేదని వాపోయారు. పిల్ల కొత్తరాజు మరియు బొర్రా రాజేశ్వరావు మరియు వారి మిత్రులు వృద్ధులు, అనాధలు, మతిస్థిమితం లేని వారి పట్ల చూపించిన ప్రేమ అభిమానాలకు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ హృదయపూర్వకంగా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.




## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

**వలిగొండ నవంబర్ 11(ప్రజాస్వరం):**

వలిగొండ మండలంలోని వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం సాయంత్రం 4.30 గంటలకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో కరెంటు వైర్లు, స్విచ్ బోర్డులు, డోర్ కర్టెన్స్, వైద్య సామాగ్రి కాలి బూడిదయ్యాయి. ఎంపిహెచ్ఓ రమేష్, సిబ్బంది స్వామి మంటలు ఆర్పే ప్రయత్నంలో స్వల్పంగా గాయపడ్డారు. మంగళవారం చౌటుప్పల్ డిప్యూటీ డిఎంహెచో యశోద ఆసుపత్రిని పరిశీలించి, షార్ట్ సర్క్యూట్ వల్ల ఆసుపత్రి పూర్తిగా ధ్వంసమైందని, అయితే ఎలాంటి ప్రాణహాని జరగలేదని తెలిపారు. నష్టాన్ని అంచనా వేసి, వైద్య సేవలు త్వరగా పునరుద్ధరించే చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.



## ఎసిబి కి చిక్కిన గ్రామ రెవిన్యూ అధికారి

**అనకాపల్లి జిల్లా, నవంబర్ 11(ప్రజాస్వరం):**

దేవరపల్లి మండలం, పెదనందిపల్లి గ్రామానికి చెందిన యస్. అమ్మతల్లినాయుడు బావకు చెందిన వ్యవసాయ భూమిని రెవిన్యూ రికార్డుల లో మ్యుటేషన్ చేసి, ఈపాస్ బుక్ ఇచ్చినందుకు గాను అనకాపల్లి జిల్లా, దేవరపల్లి మండలం, యం. అలమంద గ్రామ సచివాలయంలో గ్రామ రెవిన్యూ అధికారిగా పనిచేయుచున్న చుక్క సూర్యనారాయణ సదరు యెస్. అమ్మతల్లి నాయుడు వద్దనుండి రూ. 20,000/లంచంగా డిమాండు చేసినారు. అయితే సదరు యస్. అమ్మతల్లి నాయుడుకు ఆ లంచం డబ్బులు ఇవ్వడం ఇష్టంలేక, సదరు గ్రామ రెవిన్యూ అధికారిపై విశాఖపట్నం ఎ.సి.బి అధికారులకు ఫిర్యాదు చేసినాడు. విశాఖపట్నం ఎ.సి.బి అధికారులు, అతని ఫిర్యాదును వారి ఆఫీసు క్రైం. నెం. 9/RCTVSP/2025, అవినీతి నిరోధక (సవరణ) చట్టం 2018 సెక్షన్ 7 క్రింద కేసుగా నమోదు చేసి, సదరు గ్రామ రెవిన్యూ అధికారి, ఆ లంచం డబ్బులను, ఫిర్యాదు దారుడి వద్దనుండి మంగళవారం నాడు తీసుకొంటుండగా, రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని, అరెస్టు చేసినారు. అరెస్టు కాబడిన సదరు అధికారిని విశాఖపట్నంలోని ఎ.సి.బి. ప్రత్యేక న్యాయస్థానంలో రేపు హాజరు పరచనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలలో ఏదైనా అవినీతి జరుగుచున్నట్లయితే, సదరు సమాచారాన్ని ఎవరైనా సంభందిత జిల్లా ఎ.సి.బి అధికారులకు కాని లేదా ఎ.సి.బి. టోల్ ఫ్రీ నెంబరు 1064 లేదా ఎ.సి.బి మొబైల్ నెం. 94404 40057 .complaintsacb@ap.gov.in తెలియపరచవచ్చు.



# మార్చి లోపు పి.యం.శ్రీ నిధులు ఖర్చు చేయాలి

- **కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, నవంబర్ 11(ప్రజాస్వరం):** గ్రామీణ విద్యార్థులకు ఆధునిక మౌలిక వసతులతో నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పి.యం.శ్రీ)' పథకం కింద మంజూరైన నిధులను సమయానికి సద్వినియోగం చేసుకోవాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జిల్లా ఐడీసీ సమావేశ మందిరంలో జరిగిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, వనపర్తి జిల్లాలో పి.యం.శ్రీ కింద ఎంపికైన 21 ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కెజీబీవీలు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాలకు రూ.13.26 కోట్ల నిధులు మంజూరయ్యాయని, అయితే ఇప్పటివరకు రూ.7 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. మిగిలిన నిధులను మార్చి 2026 లోపు ఖర్చు చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రస్తుత సంవత్సరానికి రూ.6.01 కోట్లు మంజూరై, అందులో రూ.2 కోట్లు మాత్రమే వినియోగించారని తెలిపారు. నిధులు నేరుగా ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లో జమ కావడంతో, ఎస్.ఎం.సి. ( స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ) ద్వారా పారదర్శకంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు, సైన్స్ ల్యాబ్‌లు, భవిత సెంటర్ ఏర్పాటుకు నిధులు వినియోగించాలన్నారు. మౌలిక వసతులతో పాటు బడిబాట, పత్రికలు-మ్యాగజైన్‌ల కొనుగోలు, ఏక్ భారత్-శ్రేష్ఠ్ భారత్, ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం, గ్రీన్ స్కూల్ పోటీలు, ఐఐటీ-ఎంఐటీ సందర్శనలు, యూత్ ఇకో క్లబ్ కార్యకలాపాలు వంటి కార్యక్రమాలకు పి.యం.శ్రీ నిధులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. "విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే నిధులను సమర్థవంతంగా వినియోగించాలి. అప్పుడే పథకం సార్థకమవుతుంది" అని కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. స్థలం లేని చోట నిధులను ఇతర పాఠశాలలకు మళ్లించి పనులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా అధికారి అబ్దుల్ ఘని, టీజీ ఇడబ్ల్యూడీసీ కార్యనిర్వాహక ఇంజనీరు రామచందర్, ఏఈలు, పి.యం.శ్రీ ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, జీసీడీఓ శుభలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





## 42 శాతం రిజర్వేషన్లు సాధించేవరకు పోరాటం ఆగదు

- **బీసీ సాధన సమితి నేతలు**

**షాబాద్, నవంబర్ 11(ప్రజాస్వరం)** 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో 31వ రోజు మల్లారెడ్డి గూడ గ్రామ పంచాయతీ సోదరులు పరిగి శేఖర్ గౌడ్, చెందీప జంగయ్య, మీసాల వెంకటయ్య, మాణిక్యం, రాజలింగం, శ్రీనివాస్ దీక్షకు కూర్చున్నారు. సాధన సమితి సభ్యులు తమ్మలి రవీందర్, జడల రాజేందర్ గౌడ్, ల నర్సింలు మాట్లాడుతూ...42 శాతం రిజర్వేషన్లు వచ్చేంతవరకు పోరాటం చేస్తామని అన్నారు. మేము ఎంత మాకు అంత వాటా కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, రాము, గౌరీశ్వర్, చంద్రయ్య, రమేష్ యాదవ్, శ్రీకాంత్, ప్రభాకర్ గౌడ్, సత్తయ్య, జనార్ధన్, మాజిద్, అన్వర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రాంగణ నియామకాలలో ఎంపికైన 70 మంది యస్.బి.ఐ.టి. విద్యార్థులు

**ఖమ్మం నవంబర్ 11(ప్రజాస్వరం):** తెలంగాణా అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) వారి సహకారంతో నిర్వహించిన టెలీపర్ఫార్మెన్స్ ప్రాంగణ నియామకాలలో తమ కళాశాలకు చెందిన 70 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలియజేశారు. డిజిటల్ బిజినెస్ సర్వీసెస్, ఓమ్ని ఛానల్ కస్టమర్ ఎక్స్ పీరియన్స్ సొల్యూషన్స్ అందిస్తు భారతదేశంలో 90,000 ఉద్యోగులు కలిగిన అతిపెద్ద సంస్థలో తమ విద్యార్థులు స్థానం సాధించడం హర్షణీయం అని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. 2001వ సంవత్సరంలో స్థాపించబడి దాదాపు 25 సంవత్సరాలుగా బహుళజాతి సంస్థల వినియోగదారులకు సేవలు అందిస్తున్న టెలిపర్ఫార్మెన్స్ ఉద్యోగాలకు గాను మొదటి విడతగా నిర్వహించిన గ్రూప్ డిస్కషన్స్ లో 70 మంది విద్యార్థులు ప్రతిభను కనబరిచారని, రానున్న వారం రోజులలో ఆపరేషన్స్ రౌండ్ నిర్వహించి తుది ఫలితాలను వెల్లడిస్తారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా జి. ధాత్రి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు కస్టమర్ సర్వీస్ అసోసియేట్, కంటెంట్ మోడరేటర్ / అనలిస్ట్ హోదాలో ఉద్యోగాలు నిర్వహిస్తారని తెలిపారు. అమేజాన్, ఫేస్ బుక్, గూగుల్, యూట్యూబ్ వంటి అంతర్జాతీయ సోషల్ మీడియా సంస్థలుక్లైయింట్‌గా కలిగిన టెలిపర్ఫార్మెన్స్ సంస్థ తమ కళాశాలను ఎంపిక చేసి నియామకాలను చేపట్టడం తమకు గర్వకారణం అని కళాశాల ప్రిన్సిపల్ డా జి. రాజ్ కుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు 1.92 లక్షల నుండి 2.4 లక్షల వార్షిక ఆదాయంతో పాటు ఇతర సదుపాయాలు అందుతాయని తెలిపారు. ఈ ప్రాంగణ నియామకాలకు సహకరించిన టాస్క్ జిల్లా మేనేజర్ పి. దినేష్ ను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎంపికలు నిర్వహించిన టెలీపర్ఫార్మన్స్ హెచ్.ఆర్. క్యాంపస్ రిక్రూటర్ సయాన్ చక్రవర్తి తో పాటు కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా ఎ.వి.వి. శివ ప్రసాద్, డా జె. రవీంద్రబాబు, టి.పి.ఒ. యన్. సవిత, కోఆర్డినేటర్ డా జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.




## న్యాయ వాదుల రక్షణ చట్టం చేసే వరకు పోరాటం ఆగదు.

- **అలంపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి. శ్రీనివాస్.**

**వనపర్తి ప్రతినిధి నవంబర్ 11(ప్రజాస్వరం):** న్యాయ వాదుల రక్షణ చట్టం అమలు చేసే వరకు పోరాటం ఆగదని గద్వాల జిల్లా అలంపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి. శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వారు చేపట్టిన పాదయాత్ర 3వ రోజు పెబ్బేరుకు చేరుకుంది. వారికి మద్దతుగా వనపర్తికి చెందిన యువ న్యాయవాది నందిమల్ల త్రినాథ్ సంఘీభావం తెలిపి 15 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. అనంతరం అయన మాట్లాడుతూ జోగులాంబ అమ్మ వారి ఆశీస్సులతో న్యాయ వాదుల రక్షణ చట్టం అమలు కోసం ఛలో హైదరాబాద్ పాద యాత్ర చేపట్టామని అన్నారు. గత రెండు రోజుల క్రితం అలంపూర్ కోర్ట్ నుండి పాద యాత్ర మొదలు పెట్టారని అన్నారు. న్యాయ వాదులకు వ్యక్తి గత కక్షలు ఉండవని ఇరు పార్టీల గెలుపు కోసం న్యాయ వాదులు పని చేస్తారని గుర్తు చేశారు. న్యాయ వాదులపై ఈ మధ్యకాలంలో అనేక దాడులు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేసారు. న్యాయ వాదులపై దాడులు జరిగినప్పుడు కోర్టు విధులను బహిష్కరించడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేసారు. న్యాయ వాదుల రక్షణ చట్టం వచ్చే వరకు పోరాడుతమన్నారు. హైదరాబాద్ వరకు పాదయాత్ర చేసి మా డిమాండ్ ను ప్రభుత్వం దృష్టికి తీసుకెలతామని గుర్తు చేసారు. అలంపూర్ న్యాయ వాదులు చేపట్టిన పాదయాత్రకు వనపర్తి, కొల్లాపూరు న్యాయ వాదులు సంఘీ భావం తెలిపారు. ఈసందర్భంగా పెబ్బేరు సుభాష్ చౌక్ లో సుభాష్ చంద్ర బోసు విగ్రహానికి పూల మాలల వేశారు. కార్యక్రమంలో వనపర్తి న్యాయ వాదులు అల్లంపూర్ న్యాయవాదులు కొల్లాపూర్, సీనియర్, జూనియర్ న్యాయ వాదులు తదితరులు పాల్గొన్నారు.




## పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా పలువురు శుభాకాంక్షలు

**కాప్రా నవంబర్ 11(ప్రజాస్వరం):** డా. ఏ.ఎస్.రావు నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఆమె నివాసంలో ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే స్నేహితులు, అనుచరులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి పావని మణిపాల్ రెడ్డిని అభినందించారు. ఫోన్ ద్వారా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జనార్దన్ రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌రావు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, స్థానిక పత్రిక ప్రతినిధులు, పార్టీ నాయకులు, డివిజన్ కాలనీవాసులు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండే పావని మణిపాల్ రెడ్డి సేవా కార్యక్రమాలను పలువురు ప్రశంసించారు. పుట్టినరోజు సందర్భంగా అందరి ప్రేమ, ఆశీస్సులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.




## ప్రేమించిన వ్యక్తితోనే నన్ను సాగనంపండి. రోడ్డుపై బైఠాయించిన రోజా

- **పోలీసులతో గొడవపడ్డ కే. రోజా**
- **చట్టాన్ని అతిక్రమిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటాం. సీఐ కత్తి శ్రీనివాసులు.**



**బంగారుపాళ్యం నవంబర్ 11(ప్రజాస్వరం):** చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం ఎద్దుల వారి పల్లి గ్రామానికి చెందిన కె. రోజాకు వయసు 30 సంవత్సరాలు. గత 11 సంవత్సరాల క్రితం బంగారుపాళ్యం హెచ్చబ్ల్యూకు చెందిన భరత్ అనే యువకుడితో వివాహం జరిగింది. ఈమెకు 10 సంవత్సరాల ఒక కుమార్తె ఉన్నది. అయినా నలగాంపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ప్రభాకర్ తో గత నాలుగు సంవత్సరాల క్రితం వివాహేతర సంబంధం పెట్టుకుంది. వీరిద్దరి మధ్య నాలుగు సంవత్సరాలుగా సహజీవనం నడుస్తున్నది. ఈమధ్య గత మూడు నెలలుగా ఈమెను దూరంగా ఉంచడం పట్ల, ఈమె మన శ్యాంతి కోల్పోయి భర్తను వదిలించుకుంది. ప్రభాకర్ కు ముగ్గురు కుమారులు ఉన్నారు. ఇద్దరూ మేజర్లు కావడం పట్ల సహజీవనానికి న్యాయం ఎక్కడ ఉంటుందని, న్యాయపరమైన వాటికే న్యాయం చేస్తామని సీఐ కే. శ్రీనివాసులు రోజాను మందలించడం జరిగింది. చట్టాన్ని అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు.

## మక్తల్‌లో ప్రభుత్వ ఆసుపత్రి డ్రైనేజీ వివాదం

- **కాలనీవాసులకు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు**



**మక్తల్, నవంబర్ 11(ప్రజా-స్వరం):** మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కొత్త డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఆసుపత్రి ముందున్న డబ్బాల వ్యాపారులు వ్యతిరేకించడంతో, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ ఆ పైప్‌లైన్‌ను కాలనీ ఇళ్ల మధ్యగా మళ్లించారు. దీంతో పైప్‌లైన్ నుంచి వస్తున్న దుర్వాసనకు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యాన్ని తప్పుపడుతున్నారు. స్థానికుల మాటల్లో డబ్బాల ప్రాంతం ప్రభుత్వ భూమే. దానిని కొందరు కబ్జా చేసుకున్నా అధికారులు చూసే పరిస్థితి లేదు. ప్రజా ఆరోగ్యం కంటే వ్యాపారుల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారా అని ప్రశ్నిస్తున్నారు. కాలనీవాసులు ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు వెంటనే దృష్టి సారించి, పైప్‌లైన్‌ను సరైన మార్గంలో మార్చి ప్రజల ఇబ్బందులకు ముగింపు పలకాలని డిమాండ్ చేస్తున్నారు.

## చురుకుగా సాగుతున్న కోటి సంతకాల సేకరణ!

- **తగరపువలస నుండి భీమిలి వరకు జరుగు బైక్ ర్యాలీ విజయవంతం చేయండి!**

**మధురవాడ, నవంబర్ 11(ప్రజాస్వరం):** మాజీ ముఖ్యమంత్రి వర్యులు వైయస్సార్ కాంగ్రెసు పార్టీ కేంద్ర కమిటీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో భీమిలి నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెసు పార్టీ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పిలుపు మేరకు గ్రేటర్ విశాఖపట్టణం 7వ వార్డు చంద్రంపాలెం గ్రామంలో సీనియర్ నాయకులు పిళ్లా సూరిబాబు అధ్యక్షతన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిమిత్తం సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 7వ వార్డు అధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పోతిన శ్రీనివాసరావు, పిళ్లా సూరిబాబు మాట్లాడుతూ ప్రజా వైద్యం ప్రజల హక్కు అనే నినాదం తో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రైవేటీకరణ చేయవద్దని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, ప్రభుత్వ పరంగా వైద్య కళాశాలలు ఉంటే ధనికులే కాకుండా ప్రతీ పేద, మధ్యతరగతి వారు కూడా వైద్య వృత్తిలోకి వెళ్లడం జరుగుతుందని జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో భీమిలి నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెసు పార్టీ సమన్వయకర్త పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ చేస్తున్నామని తెలిపారు, సంతకాలు చేసిన ప్రతులను వార్డు నుండి నియోజకవర్గం ఇన్చార్జి చిన్న శ్రీను కు అందజేయడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా రేపు భీమిలి నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెసు పార్టీ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తగరపువలస నుండి భీమిలి వరకు జరుగు బైక్ ర్యాలీకి 7వ వార్డు నుండి అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా 7వ వార్డు వైయస్సార్ కాంగ్రెసు పార్టీ అధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు పిళ్లా సూరిబాబు, మాజీ సర్పంచ్ పిళ్లా లక్ష్మణ, వార్డు ప్రధాన కార్యదర్శి పోతిన పైడిరాజు, వార్డు ప్రచార కమిటీ అధ్యక్షులు నాగోతి తాతారావు, స్టేట్ యూత్ సభ్యులు జగుపిల్లి నరేష్, మాజీ సర్పంచ్ పిళ్లా లక్ష్మణ, పిళ్లా వెంకటరమణ, పిళ్లా చంద్రశేఖర్, పోతిన కనకారావు, పీస రామారావు, పిళ్లా అప్పన్న, పిళ్లా పోతరాజు, పిళ్లా రమణ, పిళ్లా అప్పారావు, బొల్లు అప్పారావు, నాగోతి ధర్మరాజు, పిళ్లా సురేష్, వాండ్రాసి ఎల్లాజీ, గూడేల రాజు, పిళ్లా అశోక్, పోతిన సత్తిబాబు, గుజ్జారి రాజు, పోతిన సందీప్, జిల్లా వైయస్సార్ సిపి సాంస్కృతిక అధ్యక్షులు వంకాయల మారుతి ప్రసాద్, యస్సీ నాయకులు కుడితి రామారావు, యస్టీ నాయకులు పెండ్రి అప్పన్న, వార్డు మహిళా అధ్యక్షురాలు తమ్మినేని వరలక్ష్మి, డాక్టర్ సూర్యనారాయణ తదితరులు



## అమరచింత లో ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలు పంపిణీ.

**మక్తల్ ప్రతినిధి నవంబర్ 11(ప్రజాస్వరం):** అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో మక్తల్ నియోజకవర్గం శాసన సభ్యులు, పశుసంవర్ధక శాఖ, మత్సశాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ, క్రీడలు మరియు యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి, టీపిసిసి కల్లు గీత సెల్ రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ ఆదేశానుసారం ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలు అమరచింత మున్సిపాలిటీ కార్యాలయం దగ్గర మున్సిపల్ అధికారులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేజీ మహేందర్ రెడ్డి ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ప్రకాష్ మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు. పోసిరి విష్ణు యాదవ్, కమలాకర్ గౌడ్ మాజీ ఎంపిటిసి తిరుమలేష్ పట్టణ ఉపాధ్యక్షులు పోతు శ్రీధర్, మక్తల్ నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ తౌఫిక్ రాకేష్‌గౌడ్, షానవాజ్, అమరచింత మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ రవికుమార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాస్వరం PRAJASWARAM తెలుగు దినపత్రిక
12.11.2025
బుధవారం | హైదరాబాద్
www.prajaswaramdaily.com


# రంజీ ట్రోఫీలో జమ్మూకశ్మీర్ సంచలనం.. ఢిల్లీపై చారిత్రక విజయం

- **రంజీల్లో ఢిల్లీపై తొలిసారి గెలిచిన జమ్మూకశ్మీర్**
- **7 వికెట్ల తేడాతో గెలిచి సరికొత్త రికార్డు సృష్టించిన కశ్మీర్ జట్టు**
- **అజేయ శతకంతో కశ్మీర్ విజయంలో కీలక పాత్ర పోషించిన కమ్రాన్ ఇక్బాల్**
- **రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లతో ఢిల్లీని కుప్పకూల్చిన వంశజ్ శర్మ**
- **43వ ప్రయత్నంలో ఢిల్లీపై తొలిసారి గెలిచిన జమ్మూకశ్మీర్**

ప్రజాస్వరం, హైదరాబాద్

రంజీ ట్రోఫీ చరిత్రలో జమ్మూకశ్మీర్ జట్టు సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య ఢిల్లీ జట్టుపై 7 వికెట్ల తేడాతో చారిత్రక విజయం సాధించింది. రంజీ ట్రోఫీలో ఢిల్లీపై జమ్మూకశ్మీర్‌కు ఇది మొట్టమొదటి గెలుపు కావడం విశేషం. ఈ విజయంతో ఎలైట్ గ్రూప్‌డి పాయింట్ల పట్టికలో ఆ జట్టు రెండో స్థానానికి ఎగబాకింది. 179 పరుగుల విజయ లక్ష్యంతో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన జమ్మూకశ్మీర్, ఓపెనర్ కమ్రాన్ ఇక్బాల్ అద్భుతమైన అజేయ శతకం (133 నాటౌట్) బాదడంతో సునాయాసంగా గెలుపొందింది. తన కెరీర్‌లోనే అత్యుత్తమ ఇన్నింగ్స్ ఆడిన ఇక్బాల్, జట్టును ఒంటిచేత్తో విజయతీరాలకు చేర్చాడు. అంతకుముందు రెండో ఇన్నింగ్స్‌లో ఢిల్లీ జట్టు అనూహ్యంగా కుప్పకూలింది. ఒక దశలో 267/5 స్కోరుతో పటిష్ఠంగా కనిపించిన ఢిల్లీ, కెప్టెన్ ఆయుశ్ బదోని (72), ఆయుశ్ డొసేజా (62) రాణించినా, కేవలం 10 పరుగుల వ్యవధిలో చివరి 5 వికెట్లు కోల్పోయి 277 పరుగులకు ఆలౌటైంది. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ వంశజ్ శర్మ (6/68) తన అద్భుత బౌలింగ్‌తో ఢిల్లీ పతనాన్ని శాసించాడు. ఇది అతనికి నాలుగో ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లోనే మూడో ఐదు వికెట్ల ప్రదర్శన కావడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న జమ్మూకశ్మీర్, అకిబ్ నబీ (5/35) చెలరేగడంతో ఢిల్లీని తొలి ఇన్నింగ్స్‌లో 211 పరుగులకే కట్టడి చేసింది. అనంతరం కెప్టెన్ పరాస్ డోగ్రా (106), అబ్దుల్ సమద్ (85) రాణించడంతో జమ్మూకశ్మీర్ తొలి ఇన్నింగ్స్‌లో 310 పరుగులు చేసి 99 పరుగుల కీలక ఆధిక్యం సంపాదించింది .ఢిల్లీతో ఆడిన 43వ మ్యాచ్‌లో జమ్మూకశ్మీర్‌కు ఇదే తొలి విజయం. ఈ సీజన్‌లో ఇది రెండో విజయం కావడంతో పాయింట్ల పట్టికలో ముంబై తర్వాత రెండో స్థానంలో నిలిచింది.



# 14నుండి టెస్ట్ సిరీస్ ప్రారంభం

- **భారత్- దక్షిణాఫ్రికా మధ్య రెండు టెస్టులు**
- **తిరిగి జట్టులోకి రానున్న రిషబ్ పంత్**

ప్రజాస్వరం, హైదరాబాద్

దక్షిణాఫ్రికా జట్టు భారతదేశ పర్యటనకు వస్తోంది. ఈ టూర్‌లో భారత్, దక్షిణాఫ్రికా మధ్య 2 టెస్టులు, 3 వన్డేలు, 5 టీ20 మ్యాచ్‌ల సిరీస్ ఆడనున్నారు. దక్షిణాఫ్రికా, భారత్ సిరీస్ శుక్రవారం, నవంబర్ 14 నుంచి ప్రారంభం కానుంది. ఇరు జట్ల మధ్య తొలి టెస్ట్ మ్యాచ్ ఈ 14న ప్రారంభం కానుంది. భారత టెస్ట్ జట్టుకు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ టెస్ట్ సిరీస్‌లో గాయం నుంచి కోలుకున్న వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ తిరిగి జట్టులోకి రానున్నాడు. అంతకుముందు పంత్‌ను దక్షిణాఫ్రికా ఏతో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఏ జట్టుకు కెప్టెన్‌గా నియమించారు. పంత్ చేరికతో బ్యాటింగ్ మరింత పటిష్ఠం కానుంది. భారత్, దక్షిణాఫ్రికా మధ్య టెస్ట్ సిరీస్ నవంబర్ 14న ప్రారంభమై నవంబర్ 26 వరకు జరుగుతుంది. మొదటి టెస్ట్ మ్యాచ్ కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్, రెండో మ్యాచ్ గౌహతిలో జరగనుంది. భారత్ దక్షిణాఫ్రికా జట్ల మధ్య తొలి టెస్ట్ మ్యాచ్ నవంబర్ 14 నుంచి నవంబర్ 18 వరకు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నారు. భారత కాలమానం ప్రకారం ఈ టెస్ట్ మ్యాచ్ ఉదయం 9:30 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ టెస్ట్ సిరీస్‌లో రెండో మ్యాచ్ నవంబర్ 22 నుంచి నవంబర్ 26 వరకు గౌహతిలోని బర్సపరా స్టేడియంలో జరుగుతుంది. ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం ఉదయం 9 గంటలకు మొదలవుతుంది. భారత జట్టు ఓపెనింగ్ బాధ్యతలు మరోసారి యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ భుజాలపై పడనున్నాయి. ఈ ఇద్దరు బ్యాట్స్‌మెన్స్ ఇటీవల అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. స్వదేశీ పరిస్థితులలో పరుగులు చేసిన అనుభవాన్ని కలిగి ఉన్నారు. ప్రారంభ ఇన్నింగ్స్ తర్వాత, కెప్టెన్ శుభ్‌మాన్ గిల్, సాయి సుదర్శన్, దేవ్‌దత్ పడిక్కల్, వైస్‌కెప్టెన్ రిషబ్ పంత్ మిడిల్ ఆర్డర్‌కు స్థిరత్వంతోపాటు, దృఢత్వాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నారు. కోల్‌కతా స్పిన్‌ఫ్రెండ్లీ పిచ్‌లను పరిగణనలోకి తీసుకుంటే, ఈ బ్యాటింగ్ లైనప్ బాగా సమతుల్యంగా పరిగణిస్తున్నారు. వీరు ప్రత్యర్థి బౌలర్లకు సవాలుగా మారవచ్చు.





# సన్ రైజర్స్‌లోకి రోహిత్ శర్మ..?



ప్రజాస్వరం, హైదరాబాద్

ఐపీఎల్ 2026 సందడి మరికొన్ని రోజుల్లో మొదలుకాబోతుంది. నవంబర్ 15లోపు అన్ని ఫ్రాంచైజీలు తాము రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాను బీసీసీఐకి సమర్పించాలి. ఈ నేపథ్యంలో ముంబై ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు.. ఇప్పుడు తమ టాప్ ప్లేయర్లను ఎక్స్ఛేంజ్ చేసుకోబోతున్నట్లు వస్తున్న వార్తలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఈ ఒప్పందం జరిగితే ఇది ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత హై ప్రొఫైల్ ట్రేడ్ అవుతుందంటున్నారు క్రీడా నిపుణులు.ముంబై ఇండియన్స్ ప్లేయర్ రోహిత్ శర్మ హైదరాబాద్కు.. బదులుగా స్టార్ బ్యాట్స్‌మన్ ట్రావిస్ హెడ్ ముంబై ఇండియన్స్ కు మారబోతున్నట్లు నెట్టింట్లో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. అయితే ఈ విషయంపై ఇప్పటికైతే రెండు ఫ్రాంచైజీలు.. ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన జారీ చేయలేదు. అయితే ఇదంతా 'ఎక్స్'లో ఇండియన్ క్రికెట్ అనే అకౌంట్ నుండి వచ్చిన పోస్ట్‌తో మొదలైంది. రోహిత్ శర్మ ఆధ్వర్యంలో ముంబై ఇండియన్స్ ఐపీఎల్‌లో ఐదుసార్లు టైటిల్‌ని గెలుచుకుంది. హిట్‌మ్యాన్ బ్యాటింగ్‌కు వెన్నెముక లాంటివాడు.. తనకున్న అనుభవంతో ఏ జట్టునైనా టాప్‌లో ఉంచుతాడు. రోహిత్ మరియు అభిషేక్ శర్మ కలిసి ఓపెనింగ్ చేస్తే ఐపీఎల్ రికార్డులు బద్దలవుతాయని చాలా మంది క్రికెట్ ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ముంబై ఫ్యాన్స్ మాత్రం.. రోహిత్ శర్మ హైదరాబాద్ కి వెళ్తే అది తమకు పెద్ద నష్టమని బాధపడుతున్నారు. అయితే ట్రావిస్ హెడ్ కూడా చాలా దూకుడుగా ఆడగల సమర్థుడు. 2023 ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత్‌పై చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడిన హెడ్.. హైదరాబాద్ తరపున కూడా గత సీజన్‌లో బలమైన ప్రదర్శన ఇచ్చాడు. ఇక ఈ ఒప్పందం జరిగితే ట్రావిస్ హెడ్ ముంబై తదుపరి కెప్టెన్ కావొచ్చని కొంతమంది అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. ఈ ట్రేడ్ చేస్తే రోహిత్ శర్మ అనుభవం, అభిషేక్ శర్మ దూకుడు కలిపి బలమైన ఓపెనింగ్ లైనప్‌ను తయారు చేసుకోవచ్చని మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఇప్పటికే ఐపీఎల్ అభిమానులు డిసెంబర్ మినీ వేలం మరియు ట్రేడ్ విండో ప్రకటనల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరి ఎక్స్ఛేంజ్ పుకార్లు నిజమవుతాయా లేదా కేవలం ఊహలేనా అనేది త్వరలోనే తెలియనుంది. ఐపీఎల్ 2026కి ముందు ఈ డ్రామా అభిమానుల్ని మరింత ఆకట్టుకుంటోంది.

# రోహిత్, కోహ్లీ స్థానాలను భర్తీ చేయవచ్చు

- **ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ వా**

ప్రజాస్వరం, హైదరాబాద్

విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల వన్డే భవిష్యత్తుపై ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ వా తీవ్రంగా స్పందించాడు. ప్రస్తుత క్రికెట్‌లో ఎవరి స్థానాన్ని అయినా భర్తీ చేయగల ఆటగాళ్లు ఉన్నారని అభిప్రాయపడ్డాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ 2027 వన్డే ప్రపంచ కప్ ఆడతారా లేదా అనేది అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీకి కూడా పెద్ద సవాలుగా మారింది. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో ఇద్దరు సీనియర్ ఆటగాళ్లు బాగా బ్యాటింగ్ చేసి, కుర్రాళ్లకు తాము గట్టిపోటీ ఇస్తామని.. వారితో పోటీపడి పరుగులు సాధించగలమని నిరూపించుకున్నారు. ముఖ్యంగా రోహిత్ శర్మ మంచి టచ్‌లో కనిపించాడు. కోహ్లీ వరుసగా రెండు మ్యాచ్‌లలో డకౌటైనా.. మూడో వన్డేలో కీలక ఇన్నింగ్స్‌తో కమ్ బ్యాక్ చేశాడు. 2 సంవత్సరాల తర్వాత జరిగే ప్రపంచ కప్‌లో ఆడేందుకు వీరి స్థానంపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఒక భారత జర్నలిస్ట్‌తో ఆసీస్ మాజీ కెప్టెన్ స్టీవ్ వా మాట్లాడుతూ, "ఆటగాళ్ళు బాధ్యత తీసుకోవాలి. ఎందుకంటే ఎవరూ ఈ ఆట కంటే పెద్దవారు కాదని అర్థం చేసుకోవాలి. మీరు మిమ్మల్ని ఆట కంటే ఎక్కువ అని భావించకూడదు. ఎవరైనా రోహిత్, కోహ్లీ స్థానాన్ని భర్తీ చేయవచ్చు. ఏ ఆటగాడు కూడా ఆటను తన ఇష్టం వచ్చినట్లు ముందుకు తీసుకెళ్లలేరని నేను నమ్ముతున్నాను. చివరికి, సెలక్షన్ కమిటీ ఛైర్మన్ జట్టు ప్రయోజనాల కోసం నిర్ణయం తీసుకోవాలని" కీలక వ్యాఖ్యలు చేశాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి దిగ్గజ ఆటగాళ్లను ట్రయల్స్‌లో ఉంచలేమని అజిత్ అగార్కర్ ఇప్పటికే స్పష్టం చేశారు. అయితే మీడియా నివేదికల ప్రకారం, 2027 ప్రపంచ కప్ కోసం జట్టును ఎంపిక చేయడం కేవలం ప్రదర్శన ఆధారంగానే ఉంటుందని %దీజజI% అధికారులు చెబుతున్నారు. రోహిత్ శర్మ ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో 202 పరుగులు చేసి రాణించాడు. తన బ్యాటింగ్ ప్రదర్శనకుగానూ రోహిత్ ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డు కూడా అందుకున్నాడు. మరోవైపు, విరాట్ కోహ్లీ చివరి వన్డే మ్యాచ్‌లో 74 పరుగులు చేసి ఫామ్‌లోకి వచ్చినట్లు సంకేతాలు ఇచ్చాడు. ఈ ప్రదర్శన ఆధారంగా ప్రపంచ కప్‌లో ఆడేందుకు తాను కూడా రేసులో ఉన్నానని చూపించాడు. స్టీవ్ వా మాట్లాడుతూ.. "అజిత్ అగార్కర్‌తో ఆటగాళ్లకు గుడ్ రిలేషన్ ఉంటుందని నేను ఆశిస్తున్నాను. కానీ అదే సమయంలో ఆటగాళ్లతో తగినంత దూరం పాటించాలి. అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో సమన్వయం చేసుకోవడం ముఖ్యమే. కానీ విరాట్ కోహ్లీ , రోహిత్ శర్మ ఏమనుకుంటున్నారు?. దేని ఆధారంగా జట్టు ఎంపిక జరుగుతుందనే విషయంపై ముందే క్లారిటీ ఇవ్వడం మంచిది. అనుభవానికి ప్రాధాన్యత ఇస్తారో, లేక ఆ సమయంలో ఫామ్, పరుగులు చేసే తీరును పరిగణనలోకి తీసుకుంటుందో బీసీసీఐ సెలక్షన్ కమిటీ డిసైడ్ చేసుకోవాలి. ప్రతి ఒక్కరిని రీప్లేస్ చేసే సత్తా ఉన్న యువ ఆటగాళ్లు ఉన్నారని గుర్తుంచుకోవాలని" సూచించాడు.



## రిటైన్, రిలీజ్ లిస్ట్‌లపై ఫోకస్ పెట్టిన

# సన్‌రైజర్స్

- **రిటైన్, రిలీజ్ లిస్ట్‌లపై ఫోకస్ పెట్టిన సన్‌రైజర్స్**

ప్రజాస్వరం, హైదరాబాద్



ఐపీఎల్ 2025 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తీవ్రంగా నిరాశపర్చింది. వై నాట్ 300 అంటూ భారీ అంచనాలతో బరిలోకి దిగిన ఆరెంజ్ ఆర్మీ కనీసం ప్లే ఆఫ్స్ కూడా చేరకుండానే ఇంటి దారిపట్టింది. తమకే సాధ్యమైన విధ్వంసకర బ్యాటింగ్‌తో ఈ సీజన్‌ను ప్రారంభించిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. అనూహ్యంగా వరుస పరాజయాలతో చతికిలపడిరది. చివర్లో పుంజుకొని హ్యాట్రిక్ విజయం సాధించినా టోర్నీలో ముందుడుగు వేయలేకపోయింది. మొత్తం 14 మ్యాచ్‌ల్లో 6 గెలవడంతో పాటు ఓ మ్యాచ్ రద్దవ్వడంతో 13 పాయింట్స్ సొంతం చేసుకొని 6వ స్థానంతో సరిపెట్టుకుంది. మహమ్మద్ షమీ, నితీష్ కుమార్ రెడ్డి, ఇషాన్ కిషన్, ట్రావిస్ హెడ్, ప్యాట్ కమిన్స్, జీషన్ అన్సారీలు తీవ్రంగా నిరాశపర్చారు. ముఖ్యంగా మహమ్మద్ షమీ, నితీష్ కుమార్ రెడ్డి, జీషన్ అన్సారీల వైఫల్యం సన్‌రైజర్స్ విజయవకాశాలను దెబ్బతీసింది. డిసెంబర్ చివరి వారంలో ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించిన మినీ వేలం జరగనుంది. నవంబర్ 15లోపు రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాలను ఫ్రాంచైజీలు ప్రకటించాల్సి ఉంటుంది.ఈ క్రమంలోనే ఫ్రాంచైజీలు తమ రిటైన్, రిలీజ్ లిస్ట్‌లపై ఫోకస్ పెట్టాయి. జట్టుకు భారంగా మారిన ఆటగాళ్లను వదులుకునేందుకు సిద్ధమయ్యాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ కూడా తమకు భారంగా మారిన ఆటగాళ్లను వదిలేసే ఆటగాళ్లను వదిలేయనుంది. ముఖ్యంగా టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ షమీతో పాటు అభినవ్ మనోహర్, జీషన్ అన్సారీ, రాహుల్ చాహర్, ఆడమ్ జంపాలను సన్‌రైజర్స్ వదులుకునే ఛాన్స్ ఉంది. ఈ ఐదుగురు ఆటగాళ్లు జట్టుకు భారంగా మారారు. రూ. 10 కోట్లు పెట్టిన కొన్న మహమ్మద్ షమీ కనీసం 10 వికెట్లు కూడా తీయలేదు. 9 మ్యాచ్‌లు ఆడి 11.23 ఎకానమీతో 6 వికెట్లు మాత్రమే తీసాడు. రూ. 3.20 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన రాహుల్ చాహర్, రూ. 2.40 కోట్లకు తీసుకున్న ఆడమ్ జంపాలు కూడా జట్టు అంచనాలను అందుకోలేకపోయారు. ఆడమ్ జంపా ఆరంభంలోనే గాయంతో ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. రెండు మ్యాచ్‌లు ఆడి రెండే వికెట్లు తీసాడు. పేలవ ఫామ్‌తో రాహుల్ చాహర్‌కు తుది జట్టులో ఎక్కువ అవకాశాలు రాలేదు. ఒకే ఒక్క మ్యాచ్ ఆడి ఒకే ఓవర్ బౌలింగ్ చేశాడు. జీషన్ అన్సారీ తన తొలి మ్యాచ్‌లోనే మూడు వికెట్లు తీసి సంచలన ప్రదర్శన కనబర్చినా.. ఆ తర్వాత ఆ జోరు కొనసాగించలేకపోయాడు. రూ.3.20 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన అభినవ్ మనోహర్ కూడా తీవ్రంగా నిరాశర్చాడు. 8 మ్యాచ్‌ల్లో 12.20 స్ట్రైక్‌రేట్‌తో 61 పరుగులు చేశాడు

**సన్‌రైజర్స్ హైదరాబాద్**

**వదిలేసే ఆటగాళ్ల జాబితా:**

మహమ్మద్ షమీ(రూ.10 కోట్లు), రాహుల్ చాహర్(రూ.3.20 కోట్లు), ఆడమ్ జంపా(రూ.2.4కోట్లు), జీషన్ అన్సారీ(రూ.40 లక్షలు), అభినవ్ మనోహర్(రూ.3.20 కోట్లు)

**సన్‌రైజర్స్ రిటైన్ చేసుకునే జాబితా ఇదే:**

హెన్రీచ్ క్లాసెన్(రూ. 23 కోట్లు), ప్యాట్ కమిన్స్(రూ. 18 కోట్లు), ట్రావిస్ హెడ్(రూ. 14 కోట్లు), అభిషేక్ శర్మ(రూ.14 కోట్లు), నితీష్ కుమార్ రెడ్డి(రూ.6 కోట్లు), హర్షల్ పటేల్ (రూ. 8 కోట్లు), ఇషాన్ కిషన్ (రూ. 11.25 కోట్లు), సిమర్‌జీత్ సింగ్ (రూ. 1.50 కోట్లు), అథర్వ టైడ్ (రూ.30 లక్షలు), జయదేవ్ ఉనాద్కత్(రూ.1 కోటి), కమిందు మెండీస్(రూ.75 లక్షలు), అనికేత్ వర్మ(రూ.30 లక్షలు), బ్రైడన్ కార్స్(రూ. కోటి), అనికేత్ వర్మ(రూ. 30 లక్షలు), ఇషాన్ మలింగా (రూ. 1.20కోట్లు), సచిన్ బేబీ (రూ. 30 లక్షలు)

# కోహ్లీలాగా రోహిత్ శర్మ 600 రన్స్ చేయలేదు

- **టీమ్ఇండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్**

ప్రజాస్వరం, హైదరాబాద్

ఐపీఎల్? ప్రారంభానికి ఇంకా నాలుగైదు నెలల సమయం ఉన్నా ఇప్పట్నుంచే చర్చ మొదలైంది. ప్లేయర్ల ట్రేడిరగ్, రిటెన్షన్, మినీ వేలం అంటూ సోషల్ మీడియాలో చర్చంతా ఐపీఎల్? గురించే నడుస్తోంది. ఏయే ప్లేయర్లు ట్రేడ్ అవుతారు? ఏయే జట్లలో ఎలాంటి మార్పులు ఉంటాయో అనేది పక్కనపెడిదే, తాజాగా టీమ్ఇండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్, స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మపై కీలక కామెంట్స్ చేశాడు.600 700 పరుగులు కొట్టలేదు!18ఏళ్ల ఐపీఎల్? చరిత్రలో రోహిత్ శర్మ ఏ సీజన్?లోనూ 600ం పరుగులు చేయలేదని కైఫ్ తన యూట్యూబ్? ఛానెల్?లో అన్నాడు. ఐపీఎల్?లో అతడి కెప్టెన్సీకి, అనుభవానికి మార్కులు ఇవ్వొచ్చు. కానీ, విరాట్ కోహ్లీలాగా బ్యాటర్?గా మాత్రం పెద్దగా ఇంపాక్ట్ చూపించలేదని అన్నాడు. అయితే ప్రస్తుతం రోహిత్ ఫుల్ ఫిట్?గా ఉన్నాడని, అందుకే రానున్న సీజన్?లో మాత్రం రోహిత్ సత్తా చాటడానికే ప్రయత్నిస్తాడని తెలిపాడు.'ఐపీఎల్?లో రోహిత్ శర్మ ఎప్పుడు కూడా 700 800 పరుగులు బాదలేదు. అయితే ఐపీఎల్?లో తన అనుభవానికి, కెప్టెన్సీకి మాత్రం ఫుల్ మార్కులు ఇవ్వొచ్చు. కానీ, విరాట్ లేదా ఇతర బ్యాటర్లతో పోలిస్తే మాత్రం అతడు 600ం రన్స్? చేయలేదు. ఒక సీజన్?లో కేవలం ఒకట్రెండు మ్యాచ్?ల్లో రాణించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకుంటాడు. రానున్న ఐపీఎల్ సీజన్ రోహిత్?కు ఓ పరీక్ష వంటిది. అయితే ఈసారి సత్తా చాటే ఛాన్స్ ఉంది. ఇప్పుడు రోహిత్ పరుగులు సాధించాలన్న ఆకలితో ఉన్నాడు. అందుకు తగ్గట్లే బరువు తగ్గి ఫిట్?గా కనిపిస్తున్నాడు. ఈసారి పక్కా 600ం రన్స్? చేయాలని భావిస్తుంటాడు' అని కైఫ్ పేర్కొన్నాడు.కాగా, 2008 నుంచి రోహిత్ ప్రతీ ఐపీఎల్? సీజన్?లో పాల్గొన్నాడు. ఇప్పటిదాకా 267 ఇన్నింగ్స్?ల్లో 7046 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, 47 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. రోహిత్ 2013లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాడు. ఆ సీజన్?లో 19 మ్యాచ్?ల్లో 538 రన్స్ చేశాడు. అతడి ఐపీఎల్ కెరీర్?లో ఎక్కువ పరుగులు నమోదు చేసింది ఆ సీజన్?లోనే. ఆ తర్వాత ఎప్పుడు కూడా 500 మార్క్ అందుకోలేదు.అలాగే ముంబయి ఇండియన్స్ జట్టుకు పేసర్ జస్ప్రీత్ బుమ్రానే కీలకం అని అన్నాడు. అతడు లేకపోతే జట్టు ఇబ్బంది పడుతుందని, బుమ్రా లేని లోటు 2025 ఐపీఎల్?లో స్పష్టంగా కనిపించిందని తెలిపాడు. 'బుమ్రా ఎన్ని మ్యాచ్?లు ఆడగలడు? అనేది ముంబయికి అతిపెద్ద సమస్య. అతడు అన్ని మ్యాచ్?లు ఆడితే అది వేరు. 2025 చూసినట్లైతే, సీజన్ ఆరంభంలో బుమ్రా లేడు. అప్పుడు జట్టు వరుస ఓటములు ఎదుర్కొంది. అతడు వచ్చిన తర్వాత మాత్రం వరుసగా ఆరేడు మ్యాచ్?ల్లో నెగ్గింది. తేడా స్పష్టంగా కనిపిస్తుంది. అతడు ముంబయికి అత్యంత కీలకమైన ఆటగాడు' అని కైఫ్ వ్యాఖ్యానించాడు.కాగా, ఈ డిసెంబర్?లో దిల్లీ వేదికగా మినీ వేలం జరిగే అవకాశం ఉంది. అందుకు అన్ని ఫ్రాంచైజీలు రిటైన్ చేసుకున్న ఆటగాళ్ల లిస్ట్?ను ప్రకటించాల్సి ఉంటుంది. అయితే ఈసారి మినీ వేలం కాబట్టి రిటైన్షన్?లో లిమిట్ ఉండదు. ఎంతమందినైనా జట్టులో అట్టిపెట్టుకోవచ్చు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999